ఆలయాలు ముస్తాబు!

- కార్తీక సోమవార పూజలకు ఆలయాలు సిద్ధం
- నియోజకవర్గంలోని పలు ఆలయాలకు ప్రత్యేకత
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

రాజాం/రేగిడి/సంతకవిటి:

పరమ పవిత్రమైన కార్తీకమాసంలో వచ్చే సోమవారాలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అందులోనూ ఈ మాసంలో వచ్చే మూడో సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తుతారు. ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అదే స్థాయిలో భక్తుల రాక ఉండనుండడంతో నియోజకవర్గంలోని శివాలయాలు కార్తీక మూడో సోమవార పూజలకు సరికొత్తగా ముస్తాబయ్యాయి. ఒక్కోచోట ఒక్కో ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలతో అలంకరించారు. నియోజకవర్గంలో ఒక్కో మండలంలో ఒక్కోచోట ఉండే శివాలయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. కార్తీక పూజల నేపథ్యంలో భక్తుల రద్దీ అత్యధికంగా కనిపించే ఆలయాలపై ప్రత్యేక కథనం..


సరికొత్తగా ముస్తాబైన సంకిలిలోని కాశీవిశ్వేశ్వరాలయం

బొబ్బిలి రాజుల కాలం నాటిది..


తాండ్ర పాపారాయుడు శివలింగం ప్రతిష్ఠించిన రాజాంలోని కూరాకుల వీధిలోని ఆలయం ఇదే..

రాజాం పట్టణంలోని కూరాకుల వీధిలోని శివాలయానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడి ఉమారామలింగేశ్వరాలయంలోని శివలింగాన్ని బొబ్బిలి రాజుల కాలంలో తాండ్ర పాపారాయుడు ప్రతిష్ఠించారు. బొబ్బిలి రాజుల కాలంలోనే రామాలయాలు, వైష్ణవాలయాలు అధికంగా ఉండేవి. తాండ్ర పాపారాయుడు మాత్రం స్వయాన ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించి, నిత్యం పూజలు చేసే వారని ప్రతీతి. అప్పట్లో పాలరాతి శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. దీంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో కార్తీక మూడో సోమవారం నాడు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, శివలింగానికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహిస్తారు. వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొంటారు.

ఒకేచోట 12 శివలింగాలు..

సంతకవిటి మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామంలోని బృహదీశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం.. ఉత్తరాంధ్రలోనే ప్రత్యేకత కలిగి ఉంది. మొత్తం 12 శివలింగాలను గ్రామానికి చెందిన డాక్టర్ పున్నాన నారాయణరావు దంపతులు ఇక్కడ ప్రతిష్ఠించారు. ఏటా కార్తీకంలో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, ఇక్కడి శివలింగాలకు మూడో సోమవారం క్షీరాభిషేకాలు చేస్తుంటారు.


ఎస్.రంగారాయపురంలో పూజలందుకుంటున్న బృహదీశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగం

కాశీ నుంచి తెచ్చిన శివలింగం..

రేగిడి మండలంలోని సంకిలి వద్ద నాగావళి నదీతీరాన వెలసిన శివాలయానికి ఓ విశిష్టత ఉంది. ఇక్కడి ఆలయంలో వందేళ్ల క్రితం కాశీ పుణ్యక్షేత్రం నుంచి కాలినడకన తీసుకువచ్చిన ఓ శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. అందుకే ఈ ఆలయం కాశీవిశ్వేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ఆలయానికి ఉత్తరం వైపున నాగావళి నదీ ప్రవాహం ఉండడం విశేషం. 1985లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఈ ఆలయం వద్ద పూజలు చేయడంతో పాటు ఇక్కడే రాత్రి బస కూడా చేసారని స్థానికులు చెబుతుంటారు. కార్తీకమాసం వేళ చాలామంది పలువురు ప్రముఖులు ఇక్కడి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఈ ఆలయం కూడా కార్తీక మూడో సోమవారం పూజలకు సిద్ధమైంది. విద్యుద్దీపాలంకరణలో రాత్రిపూట మెరిసిపోతూ చూపరులను ఆకర్షిస్తోంది. దైవదర్శనానికి వచ్చిన వేలాదిమంది భక్తులు ఇక్కడే నాగావళి నదీతీరాన ఉన్న జీడిమామిడి తోటల్లో పిక్నిక్‌లు కూడా చేసుకుంటుండం విశేషం.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పూనువలస పంచాయతీ కార్యదర్శి కర్రి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా హైమావతి(ఎం.ఆర్ అగ్రహారం పంచాయతీ కార్యదర్శి), ఉపాధ్యక్షుడిగా మల్లిఖార్జున(వెలగవలస పంచాయతీ కార్యదర్శి), కోశాధికారిగా వెన్నెల హరి(సింగిరెడ్డివలస పంచాయతీ కార్యదర్శి)లు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులను మిగిలిన పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


సరసనాపల్లిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, జోడిబందల తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. సర్వ మానవాళి సత్ప్రవర్తనకు భగవద్గీత ఎంతో అవసరమని, ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాలని ప్రచారకర్తలు కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞానవేదిక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న పలువురు నిరుపేదలకు ఆహారం, దుస్తులు, దుప్పట్లు, జత చెప్పులను వైఎస్సార్ సీపీ నాయకుడు బొత్స కాశీనాయుడు ఆదివారం వితరణ చేశారు. తన మనవరాలు శ్రావ్య పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో అన్నపూర్ణ ఆపన్నహస్తం పేరిట నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఇలా తమవంతు సహకారం అందిస్తున్నట్లు దాత తెలిపారు. అనంతరం కాశీనాయుడును బొంతలకోటి శంకరరావు దంపతులు సత్కరించారు.

అధికార పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి


లక్షుంనాయుడు


బొబ్బిలి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైందని, కేంద్రానికి లొంగిపోయిందని ఆనాడు చెప్పిన ఈనాటి అధికార పార్టీ(కూటమి) నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు హితవుపలికారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ..గతంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై కేసు వేసిన వారే ఇప్పుడు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు సిద్ధం చేస్తుండడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారంలోకి రావడానికి దోహదపడిన సూపర్ సిక్స్ హామీల అమలును గాలికి వదిలేసి, రోజుకో సంఘటనతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించాలన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు


రైతులతో మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: దళారులకు ధాన్యం విక్రయించవద్దని ఏవో జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట తదితర గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కొనుగోలు ధరలపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు రైస్‌మిల్లులకు ధాన్యం విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు.

వాహన తనిఖీలు


పెండింగ్ చలాన్లను పరిశీలిస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని పలు కూడళ్ల వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. సంబంధిత ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

14 మంది జూదరులపై కేసు

బొబ్బిలి: పట్టణ శివారులోని రాణిగారి తోటలో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి 14 మంది నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.30,400 నగదు, 11 సెల్‌ఫోన్లు, పేకముక్కలను సీజ్ చేసినట్లు సీఐ కె. సతీష్ కుమార్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 108 వాహన ఉద్యోగులు ఆదివారం నిరసనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు స్పష్టం చేశారు. -తెర్లాం

అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!



రోడ్లు అధ్వానంగా ఉండడంతో జనం అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రాజాం–రామభద్రపురం ఆర్అండ్‌బీ రోడ్డులో ఎం.ఆర్.అగ్రహారం–ఉత్తరావెల్లి గ్రామాల నడుమ ఉన్న రోడ్డంతా పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే రోడ్డు ఇప్పుడు పూర్తిగా గుంతలమయం కావడంతో ఆదివారం ఉదయం రామభద్రపురం నుంచి రాజాం వైపు వెళ్తున్న ఓ లారీ, రాజాం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న మరో లారీ ఎదురెదురుగా వస్తూ అదే రోడ్డులో దిగబడిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. -తెర్లాం

ఎటుచూసినా వనభో'జనాలే'..!



కార్తీకమాసం.. అందులోనూ ఆదివారం.. ఎటుచూసినా వనభోజనాల సందడే కనిపించింది. సెలవురోజు కావడంతో చాలామంది తమ పిల్లాపాపలతో సరదాగా పిక్నిక్‌లకు వెళ్లి, ఆనందంగా గడిపారు. బాడంగి మండల కేంద్రానికి దగ్గరలోని పూడివలస మామిడి తోటలో ఆర్యవైశ్యుల పిక్నిక్ జరగ్గా, వారంతా అక్కడి ఉసిరిచెట్టుకు తొలుత పూజలు చేసి, ఆ తర్వాత అక్కడే వంటలు చేసుకుని, భోజనాలు చేశారు. సాయంత్రం అంత్యాక్షరి, మిఠాయిపొట్లాం, ఖోఖో, రాముడు–సీత చీటీల ఆట ఆడి, సరదాగా గడిపారు. -బాడంగి

పరామర్శ


సూరపినాయుడును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త టంకాల సూరపినాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల కిడ్నీ సంబంధిత ఆపరేషన్ చేయించుకున్న సూరపినాయుడు ఇంటి వద్దనే ఉండి కోలుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్ ఆయన వద్దకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, నందబలగ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమావేశమైన పూర్వ విద్యార్థులు

మెంటాడ: మండలంలోని చల్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. 1988–89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా చాలా ఏళ్ల తర్వాత సమావేశం కావడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు లెంక సత్యనారాయణ, లగుడు లక్ష్మణరావు, సబ్బరపు సన్యాసప్పడు, తాడ్డి రాము నాయుడులను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకుడు కోట సతీష్‌ను అందరూ అభినందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


విజేతలైన విద్యార్థులతో కార్యక్రమ నిర్వాహకులు

బొబ్బిలి: సకల కళావిభావరి పేరిట స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన ఆనందో బ్రహ్మ, ఏబీసీడీ డ్యాన్స్ అకాడమీల ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శనలు సహా జానపద, పౌరాణిక గీతాలకు చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. ఉత్తమ ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద, శ్రీకళాభారతి కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


రామభద్రపురం: తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

రామభద్రపురం: కార్తీకమాసం పురస్కరించుకుని, మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. పరిసర ప్రాంతాలకు చెందిన చాలామంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు.

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివ, అయ్యప్ప మాలాధరణ చేసిన భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శివలింగం వద్ద పూజలు చేశారు.


రాజాం: చిత్రాలు గీయడంలో నిమగ్నమైన విద్యార్థులు

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

రాజాం/రేగిడి/సంతకవిటి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అన్ని మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పెద్దఎత్తున విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, చూడచక్కని చిత్రాలు గీసి, తమలోని విశేష ప్రతిభను చాటుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

రామభద్రపురం: ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యవాణి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని, స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం–దానివల్ల కలిగే ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి పుస్తకాలు ఒక్కటే మార్గమని, ప్రపంచ విజ్ఞానమంతా పుస్తకాల్లోనే దాగి ఉందన్నారు. ఎన్ని ఎక్కువ పుస్తకాలు చదివితే అంత ఎక్కువ జ్ఞానం అలవడుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, అంబఖండి తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా ఏ విధంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్న అంశాన్ని ఎల్2 గౌరీశ్వరరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యవంతమైన పంటలు లభిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యం వైపు మరలాలని పిలుపునిచ్చారు.

సన్మానం

బాడంగి: మండల కేంద్రంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడును ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం


పద్యం ఆలపిస్తున్న తెలుగు పండితుడు తిరుపతిరావు

తెర్లాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమం ఆద్యంతం అలరించింది. తెర్లాం హైస్కూల్‌కు చెందిన తెలుగు పండితుడు తిరుపతిరావు కవితలు, పద్యాలు, గేయాలు వినిపించారు. అలాగే మహాకవి గురజాడ అప్పారావు కవితలను విద్యార్థులకు తెలియజేశారు. ఎంతోమంది మహానుభావులు, కవులు తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేశారని, వారందరి గురించి నేటి విద్యార్థులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వేణుగోపాల్, తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తేనే కార్యాలయ పనులు..

- వాడీవేడిగా వంగర మండల సర్వసభ్య సమావేశం
- రెవెన్యూ ఉద్యోగులపై నిప్పులు చెరిగిన సభ్యులు
- విద్యాశాఖ సమీక్షలో ఎంఈవోపై మండిపాటు


ఎంఈవో తీరుపై మండిపడుతున్న సభ్యులు

వంగర: తహసీల్దారు కార్యాలయంలో కాసులిస్తేనే పనులు జరుగుతున్నాయని సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ సమీక్షలో అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు నిమిత్తం విద్యార్థులకు అవసరమైన బర్త్ సర్టిఫికెట్ల జారీకి గ్రామ స్థాయిలోని రెవెన్యూ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఎంసీ, మ్యుటేషన్, మైగ్రేషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కూడా అక్రమ వసూళ్లు చేపడుతున్నారంటూ డీటీ హరి రమణారావును సభ్యులు నిలదీశారు. పనులు జరగాలంటే సొమ్ము చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, మగ్గూరు సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, గీతనాపల్లి సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్యలతో పాటు పలువురు సభ్యులు మండిపడ్డారు. తహసీల్దారు కార్యాలయంలో ఎన్నడూ లేని వ్యవహారం సాగుతోందని, అలనాటి రాజరికపు పాలన కొనసాగుతోందంటూ ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీటీసీ సభ్యుడు కరణం సుదర్శనరావు, గేదెల రామకృష్ణ సభలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యాలయాలకు ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, అర్జీదారులను అడుగడుగునా అవమానపరుస్తున్నారని రెవెన్యూ అధికారుల తీరుపై సభలో సభ్యులు ఏకరువు పెట్టారు. ఇకపై రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి ఫిర్యాదులు రావని డీటీ హరి రమణరావు బదులిచ్చారు. సివిల్ సప్లయి శాఖ సమీక్షలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రజాప్రతినిధులతో సమీక్షలు జరపకపోవడంపై సీఎస్‌డీటీ పిన్నింటి రామారావును సభ్యులు ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఇప్పటికే ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అనంతరం రైతులు మిల్లర్లకు ధాన్యం తరలించే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. గతంలో రైతులు ఫసల్ బీమా యోజన ప్రభుత్వం చెల్లించేదని, ఇప్పుడు రైతులే నేరుగా ప్రీమియం చెల్లించాలన్నారు.

అధికార పార్టీ నాయకులకు వత్తాసు..

మండల విద్యాశాఖ సమీక్షలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఎంఈవో వై.దుర్గారావు ఐయామ్ రెడీ అంటూ ఘాటుగా బదులిలిచ్చారు. గత ప్రభుత్వ విధానాలను కించపరుస్తూ మాట్లాడడం సరికాదని సర్పంచ్‌లు బూరాడ వెంకటరావు, నెయిగాపుల శివరామకృష్ణతో పాటు ఎంపీటీసీ కరణం సుదర్శనరావు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీలు ఎంఈవోపై ధ్వజమెత్తారు. మద్దువలస, సంగాం, మద్దివలస, కొప్పరవలస తదితర గ్రామాల పాఠశాలల్లో కమిటీ ఆమోదాలు లేకుండా ఆయాలను తొలగించడంలో ఎంఈవో అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారంటూ బూరాడ వెంకటరావుతో పాటు పలువురు సభ్యులు ఎంఈవోను నిలదీశారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం గ్రామ స్థాయిలో సర్పంచ్‌ల ఆమోదంతోనే చేయాలని, వ్యతిరేక విధానాలను విడనాడాలంటూ సభ్యులమంతా మూకుమ్మడి తీర్మానం చేస్తామని ఏపీవో మద్రాపు సత్యవతికి తెలియజేశారు. సమావేశానికి హాజరవ్వని అధికారులకు నోటీసులివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చ జరిపే సమయంలో అధికారులు లేకపోతే ఎలా అని ఎంపీడీవో లోపింటి త్రినాథ్‌ను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాల స్వాధీనం

మెంటాడ: మండల పరిధిలోని జయతి రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 28 మద్యంసీసాలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ నెత్తి మీద గోనెసంచి పట్టుకుని, అనుమానాస్పదంగా వెళ్తుండగా, ఆమెను పట్టుకుని గోనెసంచిలో తనిఖీలు నిర్వహించారు. అందులోని మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీతారాం తెలిపారు.

అన్నదానం

రాజాం: మండలంలోని కొండంపేట అయ్యప్పస్వామి ఆలయం వద్ద శివ, అయ్యప్పస్వాములు(మాలాధరణ చేసిన భక్తులు)కు ఆదివారం అన్నదానం చేశారు. 600 మందికి పైగా భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదం వితరణ చేశారు.

రేగిడి: అన్నిదానాల్లో కన్నా అన్నదానం గొప్పదని వావిలవలస గ్రామానికి చెందిన శ్రీరామధర్మక్షేత్రం పీఠాధిపతి వారణాశి జగన్నాథస్వామి అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో వృద్ధులు, పేదలకు ఆదివారం అన్నదానం చేశారు. ప్రతిఒక్కరూ తమకు కలిగిన దానిలో తోచినంత సాయం చేయాలని పిలుపునిచ్చారు.